కథ

# శిక్ష

అది ఉదయం పది గంటల సమయం. అమీర్‌పేట బస్టాప్ వద్ద జనం గుమిగూడి వున్నారు. బస్సు వచ్చినప్పుడల్లా పరిగెత్తి ఎక్కుతున్నారు. నాంపల్లి వెళ్ళే బస్సులన్నీ చాలా రష్‌గా వస్తున్నాయి. రెండుమూడు బస్సులు వద్దనుకుని వదిలేసింది స్వప్న.

ఆఫీసు టైము దాటిపోతుండటంతో ఇక లాభం లేదనుకొని రద్దీగా వున్నాసరే పరిగెత్తి బస్ ఎక్కింది. లేడీస్ సీట్ల వైపు కూడా పురుషులే నుంచుని వున్నారు. ఇబ్బందిగానే లోపలికి జరిగింది.

ఎండాకాలం కావటంతో చమటకి జాకెట్ తడిసిపోయింది. ముఖం మీద పట్టిన చమట ప్రవాహంలా క్రిందికి జారి వస్తుంది. ఊపిరిపీల్చుకోవటమే కష్టమనిపిస్తుంది. అయినా తప్పదు ఇదంతా స్వప్నకి మామూలే. ఆటోల్లో వెళ్ళాలంటే వచ్చే జీతం ఆటో చార్జీలకీ చాలదు.

కండక్టర్ వచ్చాడు. సీట్లోకూర్చున్న ఓ యాభై సంవత్సరాల పెద్దమనిషి సిగిరెట్ కాలుస్తున్నాడు. లేడీస్ వెనకే కూర్చున్నాననీ, వాళ్ళకేమయినా ఇబ్బంది కలుగుతుందేమో అనే జ్ఞానం అతనిలో ఏమాత్రం కనిపించలేదు. అతని భార్య అతని ప్రక్కనే కూర్చుని వుంది..అవతల అంతమంది ఊపిరాడక బాధపడి చస్తున్నా ఆమె ఏమాత్రం ఫీలవ్వటం లేదు. పాపం అలా అలవాటై పోయిందేమో.

ఇంతలో నాంపల్లి రానే వచ్చింది. పరుగులాంటి నడకతో భయంగానే ఆఫీసులోకి వచ్చింది. గోడ గడియారం మీద టైము చూసే ధైర్యం చాలక వెళ్ళి సీట్లో కూర్చుంది. అప్పటికే టైపు చేయాల్సిన పేపర్లు ఒక కట్టపడి వున్నాయి. అదరాబాదరాగా పేపరు తీసి సెట్ చేసుకుంది. అలా ఒక నిమిషయం గడిచిందో లేదో ''స్వప్నా మేడమ్, సార్ రమ్మంటున్నాడు'' అని ప్యూన్ మాట వినబడింది. వెంటనే వెళ్ళి బాస్ ముందు నుంచుంది.

''చెప్పండి సార్'' వినయంగా అడిగింది.

'' స్వప్నా నీ జడ చాలా పొడవుగా అందంగా వుంటుంది. ఏం ఆయిల్ వాడతావో మాకూ చెప్పొచ్చు కదా'' అన్నాడు. అతడి అనవసర ప్రసంగానికి చిరాకు వేసింది. జవాబివ్వలేదు. ''నువ్వు రోజూ బస్సులో వస్తూ చాలా ఇబ్బంది పడుతున్నట్లున్నావ్. నీలాంటి అందమయిన ఆడపిల్ల బస్సులోనా వచ్చేది?'' అన్నాడు.

''కార్లో వచ్చే స్తోమత మాకు లేదుసార్'' అంది.

''పుట్టుకతో అందరికీ రాదు. మనమే రప్పించుకోవాలి. కొందరు అదృష్టంతో రప్పించుకుంటే మరికొందరు ఆలోచనతో రప్పించుకోవాలి. ప్రపంచంలో ప్రతి ఒక్కరు తలవొగ్గేది రెండక్షరాల అందం అనే పదానికి. ఇకనుంచి నువ్వు రోజూ నా కారులో రా. ఏమంటావు?'' అన్నాడు తినేసేలా చూస్తూ.

స్వప్న బలవంతంగా కోపం అణచుకుంటోంది.

''ఒకే ఆఫీసులో పనిచేస్తున్న వాళ్ళం. నాకు కారుంది. నీకు లేదు. నీకు ప్రపంచ సుందరిని తలదన్నే అందం వుంది, నాకు అది లేదు. అందరికీ అన్నీ సమానంగా వుండవు. ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని పరస్పరం సహకరించుకోవాలి.'' అన్నాడు. వాడి లాజిక్ వింటున్నంత సేపూ స్వప్న వొంటిమీద తేళ్ళు పాకినట్లు కంపరం పుట్టింది. ఈడ్చి చెంప మీద కొట్టాలనిపించింది. కానీ నిభాయించుకొంది.

''ఏంటి స్వప్నా మౌనంగా వున్నావ్. నీకు తెలుసా మౌనం అర్ధాంగీకారం. రేపు నాకారు మీ ఇంటికొస్తుందన్న మాట.'' అన్నాడు.

''సారీసార్! నేను బస్సులోనే వస్తాను'' అంది స్వప్న.

''ఈ కంపెనీ మొత్తానికి బాస్‌ని, సిటీలో పెద్ద పెద్ద వాళ్ళతో ఫ్రెండ్‌షిప్ వున్నవాణ్ని, వయసులో వున్న మగాణ్ని పైగా అందగాణ్ని. నాకుగా నేను కారు పంపిస్తాను అంటే ఎగిరి గంతేసి ఎక్కి రావలసిందిపోయి రానని సమాధానం చెప్తావా. ఆలోచించే మాట్లాడుతున్నావా లేక ఏదో ఆవేశంలో అనేశావా'' అన్నాడు.

''ఆలోచించే మాట్లాడుతున్నాను సార్. పెళ్ళికాని నేను మీతో కార్లో వస్తే అందరూ నన్ను తప్పుగా అర్ధం చేసుకుంటారు. అది నా తల్లిదండ్రులకు బాధ కల్గిస్తుంది.'' అంది సౌమ్యంగానే.

''ఏంటి స్వప్నా అలా అంటావ్? నీ తల్లిదండ్రులు బాధపడితే నీకేంటి? నీ సుఖం నీకు ముఖ్యం. నీది ఎంజాయ్ చెయ్యాల్సిన వయస్సు. వాళ్ళది నీతులు వల్లిస్తూ ఓ మూలన కూర్చోవాల్సిన వయసు. నువ్వు వాళ్ళ గురించి ఆలోచించి నీ సుఖాన్ని ఎందుకు వదులుకుంటావ్. నేను చెప్పేది వింటే నీ లైఫ్ మారిపోతుంది. విషయం ఇంతవరకూ వచ్చింది గాబట్టి చల్లకొచ్చి ముంత దాచటం నాకిష్టముండదు. అందుకే డైరెక్ట్‌గా పాయింట్‌కే వస్తున్నాను. నువ్వు నాతో ఫ్రీగా వుంటే చాలు నువ్వు కోరుకుంది క్షణాల్లో నీకు దక్కుతుంది. అందుకే నేను కోరుకుంది నాకు అందివ్వు. నీ అందం ఎలాంటిదో నీకు తెలీదు. మహారాణివై పోతావ్. ఆలోచించుకో'' అన్నాడు.

''మీకు నా వయసే గల అందమయిన భార్య వుంది కదా. ఇలా ప్రవర్తించడానికి మీకు...''

ఆమె మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ

''మగాడు సౌందర్య పిపాసి స్వప్నా. తనకున్నదాన్ని తేలిగ్గా చూస్తూ లేనిదాని కోసం ప్రాకులాడుతుంటాడు. అందుకేనేమో మగాణ్ని తుమ్మెదతో పోల్చుతూ ఆడదాన్ని పువ్వుతో పోల్చారు. తుమ్మెద కనపడ్డ ప్రతి పువ్వునీ తాకుతుంది. ఆఖరికి పిచ్చి పువ్వుని సైతం వదలకుండా మకరందం కోసం పరుగులు తీస్తుంది. ఒక్కొక్క ఆడపిల్లలో అందం ఒక్కో భాగంలో ఉంటుందని అంటారు. నీ సౌందర్యమంతా నీ పొడవయిన జడలోనే దాగుందని నా అభిప్రాయం. ఏమంటావ్?'' అన్నాడు.

''నోరు ముయ్యమంటాను. ఇంకెప్పుడూ ఇలాంటి తిక్క కోరికలు పుట్టకుండా జాగ్రత్త పడమంటాను.'' అంది స్వప్న ఇక భరించలేక.

''నీకన్నా ముందు పనిచేసిన అమ్మాయిలంతా ఇంతకన్నా గొప్పగా ప్రతిఘటించిన వాళ్ళే. కాని పరిస్థితులకు తలొగ్గి పచ్చనోట్లకు పడిపోయారు. చెప్పు నీకెంత కావాలో. వేలా, లక్షలా లేక ఓ అందమయిన ఫ్లాటా'' అన్నాడు.

''ట్రాఫిక్‌లో కారాగితే ముష్టివాడికి పావలా కూడా దానం చెయ్యని నువ్వు ఫ్లాటు రాసిస్తావా'' అంది స్వప్న హేళనగా.

''ఎస్. రాసిస్తాను. నీ అందం అలాంటిది. నువ్వు కోరుకుంటే అంతకన్నా ఎక్కువే ఇస్తాను. ఏం కావాలో అడుగు మరి'' అన్నాడు.

''మీకు పిచ్చిముదిరిపోయిందని నాకర్థమైంది. నేను వెళ్తున్నాను'' అని బయటకు పోబోతున్న స్వప్నకు అడ్డంగా వచ్చాడు.

''ఏం చూసుకొనే నీకీ మిడిసిపాటు. ఇంట్లో జరుగుబాటు లేదు. తెలుగు సినిమాలో హీరోయిన్‌లా ఎన్నో సమస్యలు నిన్ను వెంటాడుతున్నా నీకు పిసరంత పొగరు కూడా తగ్గలేదే. నువ్వు నన్ను కాదని ఎలా తప్పించుకోగలవు'' అని ఆమెని పట్టుకోబోయాడు. విసురుగా నెట్టింది. క్రింద పడ్డాడు. తలుపు తీసుకొని బయటకెళ్ళింది క్రిందపడిన రాఘవరావు లేచి తన కుర్చీలో కూర్చున్నాడు. సిగిరెట్ కాల్చాడు. ఇంతవరకు తను ఎన్నో కేసులను అవలీలగానే లొంగదీశాడు. తన సరస క్రీడా జీవితంలో ఇంత ప్రతిఘటించిన మొండిపిల్లనింతవరకూ చూడలేదనుకున్నాడు. ఆలోచించాడు. ప్రతీకారం తీర్చుకోటానికి ఒక పథకం ఆలోచించాడు. తనకు దక్కని ఆ అందాన్ని సర్వనాశనం చెయ్యాలనుకున్నాడు. వెంటనే రూములో నుండి బయటికి నడిచాడు.

బాస్ ఇంత పెందలాడే బయటికెందుకు వెళుతున్నాడో అర్థంకాక అందరూ ఆశ్చర్యంగా మొఖం పెట్టారు...ప్యూన్

చెబితేగాని అర్థం కాలేదు. ఈరోజు అయ్యగారి భార్య పుట్టినరోజని..మేడంకి ఏదైనా గిఫ్ట్ తెద్దామని ముందే వెళ్లి వుంటాడులే అనుకున్నారు. రాఘవరావు కారుని ఒక షాపుముందాపాడు. తన బాధను మిత్రుడికి చెప్పాడు. వెంటనే ఒక బాటిల్ తెచ్చిచ్చాడు స్నేహితుడు. అయిదు నిమిషాల్లో పని చేస్తుందని చెప్పాడు. అది విన్న రాఘవరావు అమితానంద భరితుడయ్యాడు. దాన్ని కోటు జేబులో వేసుకొని కారెక్కాడు. ఇంటికి వెళ్ళి కోటు విప్పి భార్య చేతికిచ్చి బాత్‌రూంలో దూరాడు. అసలే అందం పిచ్చి ఎక్కువేమో బాత్‌రూంలోని అద్దాల్లో తనని తాను చూసుకుంటూ బాత్‌రూంలోనే గంట గడిపేశాడు.

రాఘవరావు భార్య కోటుని హేంగర్‌కి వేయబోతూ జేబులోని బాటిల్ కనిపిస్తే తీసి చూసింది. సుగంధ ఆయిల్ అని రాసుంది. అది దొంగ లేబుల్ అని ఆమె అనుమానించే ఆస్కారమే లేదు. వాసన చూసింది. మంచి సుగంధం పరిమళం వెదజల్లుతోంది. వెంటనే దాన్ని తీసుకెళ్ళి కొబ్బరినూనె బాటిల్‌లో కలిపేసింది. కాఫీ కలిపేందుకు వంటింట్లోకి వెళ్ళింది.

**రాఘవరావు కారుని ఒక షాపుముందాపాడు. తన బాధను మిత్రుడికి చెప్పాడు. వెంటనే ఒక బాటిల్ తెచ్చిచ్చాడు స్నేహితుడు. అయిదు నిమిషాల్లో పని చేస్తుందని చెప్పాడు. అది విన్న రాఘవరావు అమితానంద భరితుడయ్యాడు. దాన్ని కోటు జేబులో వేసుకొని కారెక్కాడు.**




రాఘవరావు బాత్‌రూం లోంచి బైటకొచ్చి అద్దం ముందు మేకప్ మొదలుపెట్టాడు. హెయిర్ ఆయిల్ రాసుకున్నాడు. తల దువ్వాడు. అందమయిన తన కర్లింగ్ హెయిర్‌ని పలుమార్లు గర్వంగా చూసుకున్నాడు. ''ఏమండీ కాఫీ'' అంది భార్య.

తీసుకొని తాగాడు. ఆమె ఖాళీ కప్పుతో వెళ్తూ వెళ్తూ ''ఈరోజు నా పుట్టినరోజు, మర్చిపోయేరు పెందలాడే వచ్చేయండి'' అంది.

అప్పటివరకు పెళ్ళాం పుట్టినరోజు కూడా గుర్తులేని అతను ''సరేలే'' అన్నాడు. భార్య లోపలికి వెళ్ళింది. హఠాత్తుగా తలలో జిల పుట్టింది. గోక్కున్నాడు. ఓ పది వెంట్రుకలు చేతికొచ్చాయి. భయం వేసిందతనికి. మళ్ళీ తల దురద. భరించలేని దురద. ఈసారి ఓ గుప్పెడు జుట్టు చేతికొచ్చింది. గుండె గుభేల్‌మంది. తలంతా కంపరమెత్తిపోయింది. అతని ప్రమేయం లేకుండానే అతని చేతులు జుట్టు మొత్తాన్ని పీకేవరకు ఆగలేదు. మొత్తం జుట్టు అయిదునిముషాల్లో ఊడిపోయి గుండే మిగిలింది. లోపలి నుండి వచ్చిన భార్య అతడ్ని చూసి గుర్తుపట్టక ''ఏయ్. ఎవరు నువ్వు. లోపలికెలా వచ్చావు'' అని అరిచింది. దాంతో భోరున ఏడ్చాడు రాఘవరావు. బాటిల్‌లోని ద్రవాన్ని హెయిర్ ఆయిల్‌లో కలిపిన వైనం వివరించింది భార్య. దాని గురించి అడిగింది. చెప్పలేని పరిస్థితి . నిజం ఒప్పుకున్నాడు. స్వప్నను అందవిహీనంగా మార్చాలని కొన్న ఆ ద్రవం తననే విహీనంగా మార్చటంతో ఖిన్నుడయ్యాడు. మళ్ళీ జుట్టు పెరిగే అవకాశం లేదని స్నేహితుడు చెప్పినప్పుడు కలిగిన ఆనందం ఇప్పుడతని మొఖంలో లేదు. ఎదుటి మనిషికి కీడు జరగాలని కోరుకున్నా, తలపెట్టినా వెంటనే దేవుడు తగిన శాస్తి చేస్తాడు. ఇదే కోర్టులు విధించలేని సరైన శిక్ష.

**డి. శంకరరావు**

★